
సాక్షి
కుమురం భీం

శుక్రవారం ၊ 16 ၊ ఫిబ్రవరి ၊ 2024



కొలువు సాధించారు
ఉమ్మడి జిల్లా యువకులు పట్టుపట్టి పోలీసు కొలువు సాధించారు. మారుమూల పల్లెల నుంచి కష్టాలను ఎదిరించి లక్ష్యాన్ని చేరుకున్నారు. 8లో▸



రథోత్సవానికి ముస్తాబు
జిల్లాకేంద్రంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /19.5

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు వేడిగా, రాత్రి చల్లగా ఉటుంది.

తక్కెడలో తూగేదెవరు?

- పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై పార్టీల కసరత్తు
- అన్ని పార్టీల్లోనూ మొదలైన చర్చలు
- 'ఆదిలాబాద్' స్థానంపై గురి
- ఉమ్మడి జిల్లా రాజకీయాలపై ప్రత్యేక దృష్టి
- కాంగ్రెస్, బీజేపీ టికెట్‌కు డిమాండ్



సాక్షి, ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థుల ఎంపికపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుంది..? సిట్టింగ్‌ల సంగతి ఏంటి..? ప్రత్యర్థి పార్టీలు ఏం చేస్తున్నాయి? కొత్తగా వచ్చిన వారు రేపు టిక్కెట్ల కోసం ఒత్తిడి చేస్తే ఏం చేయాలి? ఇదివరకే అనుకున్న ఆశావహులను మార్చాల్సి వస్తే ఏవిధంగా సంతృప్తి పర్చాలి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఆయా పార్టీలు విశ్లేషణలు చేసుకుంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పార్టీలు మారుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ఇంతవరకు ఏ పార్టీ తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు కానీ ప్రాథమిక అవగాహనకైతే వచ్చాయి. ఇప్పటికిప్పుడే పేర్లు అధికారికంగా వెల్లడి చేస్తే లేనిపోని తలనొప్పులు వస్తాయన్న కారణంతో అన్ని పార్టీలు సైలెంట్‌గా ఉన్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై అన్ని పార్టీల్లోనూ వాడీవేడి చర్చ జరుగుతోంది.

బీఆర్‌ఎస్‌లో అయోమయం...
గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు రేసులో దూసుకుపోయిన బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పుడు వెనుకంజలో ఉంది. ఇంతవరకు జరిగిన నష్టాన్ని గ్రహించిన అధిష్టానం.. ఇప్పుడు దానిని అధిగమించేందుకు నానా తంటాలు పడుతోంది. ఇందులో భాగంగా పార్టీ ముఖ్యనేతలు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం, దాని పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ఆశావహుల వివరాలను సేకరిస్తున్నారు. కానీ తమకు టిక్కెట్లు కావాలని ఉత్సాహంగా ముందుకు వచ్చేవారు పెద్దగా కనిపించడం లేదు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గత ఎన్నికల్లో తన టిక్కెట్‌ను త్యాగం చేయడంతో అప్పట్లో అధిష్టానం అతనికి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలైన జాన్సన్ నాయక్, మాజీ ఎంపీ గోడం నగేశ్‌లు కూడా ఎంపీ టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇద్దరిలో ఎవరో ఒకరిని అభ్యర్థిగా ఎంపిక చేసే ఆలోచన కూడా బీఆర్‌ఎస్ అధిష్టానికి లేదు. సరికదా ఇంకెవరూ ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ టిక్కెట్‌పై ఆసక్తి చూపించడం లేదు. త్వరలో అనూహ్య మార్పులు ఏమైనా చోటుచేసుకుంటే తప్ప.. ఈ స్థానానికి ఆత్రం సక్కే బీఆర్‌ఎస్ అభ్యర్థి కావడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీలో పోటీ..
ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి రంగంలోకి దిగడానికి కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే అధిష్టానం వద్ద దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థుల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. గెలుపు గుర్రాలకే టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించి ఆ మేరకు ఢిల్లీ నుంచి ఏఐసీసీ పరిశీలకులను జిల్లాకు పంపింది. ప్రస్తుతం వారు ఆదిలాబాద్ పార్లమెంట్‌లో తమ పార్టీ బలాబలాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి తమకు అవకాశం కల్పించాలంటూ అజ్మీరా రేఖానాయక్, ఆత్రం సుగుణ, నరేశ్‌జాదవ్, రాంకిషన్, రోషన్‌తో పాటు 12 మంది దరఖాస్తు చేసుకోవడంతో టిక్కెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. అయితే సర్వేలో ఎవరికి అనుకూలంగా ప్రజల మద్దతు ఉంటుందో వారికే టిక్కెట్ కేటాయించనున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పావులు కదుపుతున్న బీజేపీ
మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మూడు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ.. ఎంపీ స్థానాన్ని సైతం తన ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతోంది. సిట్టింగ్ స్థానంలో మరోసారి గెలుపొందాలని ఆ పార్టీ నాయకులు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు 'అభ్యర్థి ఎంపిక దాదాపు పూర్తయిందని, అవసరమైతే తప్ప మార్పు ఉండకపోవచ్చని' ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల బీజేపీ కేంద్ర మంత్రి అమిత్ షాను కలిసిన సందర్భంగా టిక్కెట్ తనకే ఇస్తారని హామీ లభించిందంటూ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు ప్రకటించుకున్నారు. అయితే పార్టీ అధిష్టానం ఇప్పటివరకు అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. అయితే బీజేపీ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కూడా టిక్కెట్ టిక్కెట్ రేసులో ఉన్నట్లు సమాచారం. భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రకాశ్ జాదవ్, సినీనటుడు అభినవ్ సర్దార్, ఆదిలాబాద్‌కు చెందిన శ్రీలేఖ, డాక్టర్ సుమలతలు కూడా టిక్కెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. శ్రీలేఖను బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సిఫార్సు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద అభ్యర్థుల ఎంపిక సంగతి ఎలా ఉన్నా.. పార్టీల్లో ఉత్తేజం నింపుదామని జిల్లాకు వచ్చిన పరిశీలకులు నిర్వహిస్తున్న పంచనామా ఏ మేరకు ఫలిస్తుందో అనుమానమే.

న్యూస్‌రీల్

ఐసీడీఎస్ పీడీగా భాస్కర్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ(ఐసీడీఎస్) అధికారిగా గురువారం డాక్టర్ భాస్కర్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఐసీడీఎస్ పీడీగా పని చేసిన సావిత్రి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. భాస్కర్ జగిత్యాల జిల్లా అధికారిగా పని చేస్తుండగా బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మెరిట్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఒప్పంద ప్రాతిపదికన వైద్యాధికారి(ఆయుర్వేద యునానీ) పోస్టుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల జాబితాను జిల్లా వైద్యారోగ్యశాఖ విడుదల చేసింది. మెరిట్ జాబితాను జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గల నోటీసు బోర్డుతోపాటు https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 21 ఉదయం 10.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌లో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

పాఠకులకు గ్రంథాలయం అందుబాటులోకి తేవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం టీఎస్ఈడబ్ల్యూ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, గ్రంథాలయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ పనులు పూర్తి చేసి ఫర్నీచర్ ఏర్పాటు చేయాలన్నారు. టీఎస్ఈడబ్ల్యూ కింద చేపడుతున్న పనులు, పురోగతి వివరాలపై నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన సీసీరోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఉపాధి హామీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక అంశాలను ముందుగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ పనిని జియో ట్యాగింగ్ చేయాలని, డిమాండ్ అలోకేషన్ చేసి మస్టర్లు సమర్పించాలని ఆదేశించారు. మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. రేపటిలోగా పనులు ప్రారంభించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రాకముందే పనులు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాజన్న

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానాన్ని విస్మరించిందన్నారు. ఈ సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు దినకర్, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాల పాత్ర కీలకం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ప్రత్యేక బృందాలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రత్యేక బృందాలు తమ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన వారు బదిలీపై వెళ్తే వారి స్థానంలో ఇతరులను నియమించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని, ఆధారాలు లేని డబ్బు, ఆభరణాలు, కానుకలు సీజ్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతీ అంశాన్ని వీడియో చిత్రీకరించాలన్నారు. అభ్యర్థుల బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతర ప్రచార సంబంధిత అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. కంట్రోల్ రూం, సీవిజిల్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో డీటీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతలో స్నేహభావం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్(సిర్పూర్): క్రీడలతో యువతలో స్నేహభావం పెంపొందుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బెజ్జూర్ మండల పరిధిలో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తూనే అదే స్ఫూర్తితో జీవిత లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆధిపత్య పాలకులు ప్రజల హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన గ్రామీణ క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గణపతి, దుర్గం ప్రవీణ్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, మాజీ సర్పంచ్ రావి, నాయకులు జాడి శ్యామ్‌రావు, రాంప్రసాద్, ఖాజా, విజయ, నిర్మల, జ్యోతి, దుర్గం వెంకటేశ్, జావిద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

డీపీఆర్‌వోగా సంపత్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: కుమురంభీం డీపీఆర్‌వోగా సంపత్‌కుమార్‌ను నియమిస్తూ సమాచార శాఖ కమిషనర్ హన్మంత్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీపీఆర్‌వో కృష్ణమూర్తిని మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. కాగా.. సంపత్‌కుమార్‌కు గతంలో కుమురంభీం జిల్లా ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది.

ఆసిఫాబాద్ ఆర్డీవోగా లోకేశ్‌రావు
ఆసిఫాబాద్ ఆర్డీవోగా గురువారం వి.లోకేశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ ఆర్డీవోగా పని చేసిన కదం సురేశ్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎస్సీడీసీఎల్‌ఏలో పని చేస్తున్న లోకేశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు.

ఉమ్మడి జిల్లాకు రేడియో ప్రసారాలు



మాట్లాడుతున్న నౌషీ నాయక్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ప్రసార సామర్థ్యం ఉమ్మడి ఆదిలాబాద్ వరకు విస్తరించిందని కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఇంజనీర్ మాలవత్ నౌషీ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆకాశవాణి కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రం ముఖ్య కార్యక్రమాధికారి రామేశ్వర్ కేంద్రేతో కలిసి మాట్లాడారు. ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం కిలోవాట్ ప్రసార సామర్థ్యంతో ప్రారంభమైందని, జనవరి 20 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యంతో ప్రచారాలను వినిపిస్తోందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు రేడియో ప్రసారాలు వెళ్తాయని వెల్లడించారు. మొబైల్ యాప్ ప్లాట్‌ఫారం ద్వారా ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ప్రసారాలు వినే వీలు కలిగిందన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ అవసరం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుశాఖలో పని చేసే అధికారులు, సిబ్బందికి క్రమశిక్షణ అవసరమని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో 15 రోజులుగా కొనసాగుతున్న జిల్లా ఆర్మ్‌డ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆర్మ్‌డ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 15 రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔట్‌డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారని అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక దృఢత్వ, మానసికోల్లాసం లభిస్తుందన్నారు. పరేడ్‌ను చూస్తే తన శిక్షణ రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. పోలీసులు వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ పెద్దన్న, ఎంటీవో ఆర్ఐ అంజన్న తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మోడీ కేజీబీవీలో విద్యార్థినులతో రాయిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి/ఆసిఫాబాద్‌అర్బన్: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, కెరమెరి మండలం మోడీ గ్రామంలోని కేజీబీవీని గురువారం డీఈవో అశోక్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పాఠ్యాంశాల పూర్తి, ప్రత్యేక తరగతులు, హాజరు శాతం, అభ్యాస దీపికల తర్ఫీదు, టెస్టుల నిర్వహణ తదితర వివరాలు తెలుసుకున్నారు. సమ్మేటివ్ అసైన్మెంట్, లఘు పరీక్షల జవాబు పత్రాలు, వారికి వచ్చిన మార్కులను పరిశీలించారు. విద్యార్థులతో వివిధ అంశాలపై రాయించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కృష్ణారావును ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌వోలు భరత్, శ్రీనివాస్, ప్రత్యేకాధికారి మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలతో దంపతుల హత్య

- సొంత తమ్ముడు, మరదలిని హతమార్చిన అన్న
- పత్తి ఏరుతుండగా కొడుకులు, కుమార్తెతో కలిసి గొడ్డళ్లతో దాడి
- ఘటనా స్థలంలోనే మృతి చెందిన దంపతులు
- వాంకిడి మండలం ఖమాన గ్రామంలో దారుణం



బైనాబాయి మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): పక్కపక్కనే ఉన్న చేలకు సంబంధించి హద్దుల విషయం మొదలైన గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. పంపకాల నుంచి కొనసాగుతున్న భూతగాదాలు రెండు ప్రాణాలను బలి తీసుకున్నాయి. సొంత తమ్ముడు, మరదలు అని కూడా చూడకుండా కిరాతకంగా నరికి చంపాడు అన్న. పత్తి ఏరుతున్న దంపతులను మాటు వేసి కొడుకు, కుమార్తెతో కలిసి హతమార్చాడు. ఈ దారుణ ఘటన వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన డెంగ్రె మారుతి మొదటి భార్యకు ముగ్గురు కుమారులు పత్రు, పొచ్చు, దస్రూ, రెండో భార్యకు ఒక కుమారుడు విఠు ఉన్నారు. వీరికి ఖమాన, కోమటిగూడ గ్రామాల మధ్య వ్యవసాయ భూములు ఉన్నాయి. మారుతి బతికి ఉన్నప్పుడే భూపంపకాలు పూర్తయ్యాయి. కాగా.. పత్రు, దస్రూ(52)కు చెందిన చేలు పక్కపక్కనే ఉండగా.. కొన్నేళ్లుగా హద్దుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం దస్రూ తన భార్య బైనాబాయి (47), కూతురు సవిత, కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి పత్తి ఏరేందుకు వెళ్లాడు. శ్రీకాంత్ మధ్యాహ్నం చేను వద్దే అన్నం తిని వాంకిడికి వెళ్తున్నాని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సవిత పత్తి ఏరుతుండగా.. బైనాబాయి కూతురి బిడ్డకు డబ్బా పాలు పట్టిస్తూ కూర్చుంది. అదే సమయంలో దస్రూ కిలోమీటరు దూరంలోని మరో చేనుకు వెళ్లాడు. పక్క చేనులో మాటువేసిన పత్రు.. తన పెద్ద కొడుకు తిరుపతి, చిన్న కొడుకు సాయి, కుమార్తె బాయబాయితో కలిసి గొడ్డళ్లు, కర్రలతో మనుమడికి పాలు తాగిస్తున్న బైనాబాయిపై దాడి దిగారు. పక్కనే పత్తి ఏరుతున్న కుమార్తె అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. తనని కూడా చంపేస్తామని బెదిరించడంతో ఆమె కొడుకును తీసుకుని పారిపోయింది. బైనబాయిని గొడ్డళ్లతో హతమార్చిన అనంతరం వారు అక్కడి నుంచి దస్రూ చేను వైపునకు వెళ్లారు. అదే సమయంలో పనులు ముగించుకుని తిరిగి వస్తున్న దస్రుపై మార్గమధ్యలో గొడ్డళ్లతో దాడి చేశారు. దస్రూసైతం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దంపతులను హత్య చేసిన అనంతరం నలుగురు నిందితులు వాంకిడి పోలీస్‌స్టేషన్ పోలీసులకు లొంగిపోయారు.



దస్రూ మృతదేహం

ఘటన స్థలం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

దంపతుల హత్య జరిగిన ఖమాన గ్రామ శివారు ప్రాంతాన్ని ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ సతీశ్ పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గతంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు.

విద్యుత్ తీగలు అమరిస్తే చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: పంటలకు రక్షణగా.. అటవీ జంతువులను వేటాడానికి అక్రమంగా విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సతీశ్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు పంటల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడంతో జరిగే ప్రమాదాలపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జంతువులను వేటాడే క్రమంలో వేటగాళ్లు కరెంట్ తీగలు అమర్చడంతో పొలాలకు వెళ్లే రైతులు, పోలీసు, ఫారెస్టు సిబ్బంది ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ దుశ్చర్యలకు పాల్పడితే పదేళ్ల వరకు జైలు శిక్ష, లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైన అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే 87126 70506, 87126 70567 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

చెన్నూర్ ఏడీఏ, ఏవో సస్పెన్షన్

మంచిర్యాలఅగ్రికల్చర్: చెన్నూర్ డివిజన్ వ్యవసాయ అధికారి(ఏడీఏ) బాపు, మండల వ్యవసాయ అధికారి(ఏవో) కవితను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గురువారం రాత్రి ఉత్వర్వులు జారీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాలకు ఎరువుల కేటాయింపులో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ చేపట్టి వారం రోజుల క్రితం నివేదిక అందజేశారు. వ్యవసాయ ఉన్నతాధికారులు స్పందించి సస్పెండ్ చేశారు. మందమర్రి మండల ఏవో రాజేశంకు చెన్నూర్ ఇన్‌చార్జి ఏడీఏ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. వివరణ కోరేందుకు జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను సంప్రదించగా స్పందించలేదు.

మార్చి 3 నుంచి బీసీ చైతన్య యాత్ర



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మార్చి 3 నుంచి బీసీ చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో చైతన్యయాత్ర కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బీసీలను చైతన్యపర్చి హక్కుల కోసం ఉద్యమానికి ప్రజాస్వామిక వాదులు ముందుకు రావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ నాయకులు కనుకుట్ల మల్లయ్య, గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ది చంద్రమౌళి, నాయకులు మొగిలి లక్ష్మణ్, సోమయ్య, భూమన్న, చిందం వెంకటేష్, ఆవునూరి పోచం పాల్గొన్నారు.

భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర మహాసభలు

పాతమంచిర్యాల: భారతీయ మజ్దూర్ సంఘ్ వార్షిక రాష్ట్ర మహాసభలు ఈ నెల 17, 18 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్నామని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మహసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన పవర్ ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో విటమిన్-ఏ లోపం లేకుండా చూడాలి



విటమిన్-ఏ ద్రావణం మింగిస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం: చిన్న పిల్లల్లో విటమిన్-ఏ లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని జిల్లా ఉప వైద్యాధికారి సీహెచ్.రాంమూర్తి సూచించారు. విటమిన్-ఏ లోపం నివారణకు ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఈ నెల 13న ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ద్రావణం వల్ల పిల్లలకు భవిష్యత్తులో రే చీకటి రాకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు దివ్య, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరుణ, జ్యోతిలు పాల్గొన్నారు.

కొలువు సాధించారు..

పోలీస్ శాఖ ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువత సత్తా చాటారు. పట్టువదలకుండా... నిరాశకు లోను కాకుండా శ్రమించి ప్రభుత్వ కొలువు సాధించారు. పోలీస్ కావాలనే తపనను సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించి విజయం కైవసం చేసుకున్నారు. పోలీస్ ఉద్యోగం సాధించిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

డ్రైవర్ నుంచి కానిస్టేబుల్‌గా..



నేరడిగొండ: ప్రభుత్వ కొలువు సాధించాలనే తన తపన నాల్గోసారికి నెరవేరింది. తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఓ ప్రైవేట్ వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తూ పోలీసు పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మూడుసార్లు విఫలమైనా నిరుత్సాహపడకుండా ముందుకు సాగాను. నాల్గోసారి కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను.

సుద్దల స్వామి, నేరడిగొండ



తండ్రి కష్టాన్ని చూసి.. తల్లి మరణాన్ని దిగమింగి

సిరికొండ: చిన్నప్పటి నుంచి తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి.. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కసితో ఉద్యోగానికి సిద్ధమవుతున్న తరుణంలో వారి తల్లి అనారోగ్యంతో తనువు చాలించింది. దీంతో వారికి కష్టాలు రెట్టింపయ్యాయి. తల్లి లేదనే దుఖాన్ని దింగమింగి ప్రభుత్వ నోటిఫికేషన్ రావడంతో పట్టణబాట పట్టారు ఆ ఇద్దరు అన్నదమ్ములు. పట్టుదలతో చదివి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారే మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రాథోడ్ మోతిలాల్-లక్ష్మిబాయి దంపతుల కుమారులు రాథోడ్ నాందేవ్(సీవిల్), చిన్న కుమారుడు రాథోడ్ అర్జున్ (ఏఆర్).

– అన్నదమ్ములు రాథోడ్ అర్జున్, నాందేవ్

అమ్మ ధైర్యం చెప్పింది..



కుంటాల: మానాన్న ఎనిమిదేళ్ల క్రితం చనిపోయాడు. మా అమ్మ బీడీలు చూడుతూ ధైర్యం చెప్పి నన్ను చదివించింది. డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో ఎంకాం ద్వితీయ సంవత్సరం చదువుతుండగానే సివిల్ కానిస్టేబల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను.

– గడ్డం సంధ్యారాణి, కుంటాల

కష్టపడి చదివించారు..



కుంటాల: నాకు తెలిసి తెలియని వయసులో మా నాన్న చనిపోయారు. అమ్మ, అమ్మమ్మలు కలిసి కూలీ పనిచేశారు. నన్ను ఇష్టంగా చదివించారు. వారి కష్టాలను తొలగించేందుకు కష్టపడి చదివాను. ప్రస్తుతం ఉద్యోగం రావడంతో వారు సంతోషపడ్డారు. ఆనందంగా ఉంది.

– అరిగెల సోనీ, కల్లూర్

ప్రమాదం జరిగినా పట్టు వదలకుండా..



సిరికొండ: పోలీస్ ఉద్యోగంపై ఉన్న మక్కువ ప్రమాదం జరిగినా పట్టువదలనివ్వలేదు. మండల కేంద్రానికి చెందిన ఎగ్గిడి ఇస్తారి-రుక్మిణి దంపతుల పెద్ద కుమారుడు ఎగ్గిడి మహేష్ 2016లో ప్రభుత్వం వేసిన పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ ప్రమాదవశాత్తు జరిగిన ఓ సంఘటనతో రిక్యూట్‌మెంట్‌కు వెళ్లలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా ఇంటి వద్దే ఉండి చదువుకున్నాను. తన తండ్రి సైతం ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ నన్ను చదివించాడు. వ్యవసాయ పనుల్లో తోడుగా ఉంటూనే నోటిఫికేషన్ రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి అతడికి ఇష్టమైన పోలీసు ఉద్యోగం సాధించాడు.

– ఎగ్గిడి మహేష్

రెండో ప్రయత్నంలోనే...



కుంటాల: వ్యవసాయ భూమి లేక మా నాన్న కొలుకు తీసుకొని నన్ను చదివించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్న. ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేస్తుండగా ఉద్యోగానికి ఎంపికయ్యాను. 2018లో ఉద్యోగం రాక నిరాశకు గురయ్యాను. రెండో ప్రయత్నంలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

– గీత్ కుమార్, అంబుగామ

నిరుపేద కుటుంబం నుంచి..



చెన్నూర్: మా నాన్న దాసరి స్వామి ఆనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి శ్యామల కూలీ పని చేసి నన్ను చదువించింది. కుటుంబ పోషణ బాధ్యతలు తీసుకోవాలని కష్టపడి చదివాను. ఎస్సై, కానిస్టేబుళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా. కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగం అవసరం.

– దాసరి వినోద్, చెన్నూర్

డిగ్రీ పూర్తయింది..



చెన్నూర్: మా నాన్న ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. పోలీసు కానిస్టేబుల్ కోసం దరఖాస్తు చేసుకొన్నా. ఓ పక్క మైదానంలో వ్యాయామం చేస్తూ మరో వైపు పట్టుదలతో చదివాను. నా కష్టానికి ప్రతిఫలం దక్కింది. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. పట్టుదల క్రమశిక్షణతో సాధన చేస్తే ఏదైన సాధ్యమవుతుందన్న దానికి నేనే ఉదాహరణ.

– తోట శ్రీనివాస్, చెన్నూర్

ఆటో నడుపుతూ..



తాంసి: కానిస్టేబుల్ ఉద్యోగం కోసం 2016 నుంచి సన్నద్ధమవుతున్నాను. రెండుసార్లు విఫలమైనప్పటికీ నిరాశ చెందలేదు. మొదటిసారి ఈవెంట్స్‌లో ఉద్యోగం చేజారింది. రెండోసారి రెండు మార్కుల వ్యవధిలో ఉద్యోగం దూరమైంది. ఈ క్రమంలో పెళ్లి కావడంతో కుటుంబ బాధ్యతలు పెరిగాయి. కుటుంబ పోషణ కోసం ఐదేళ్లుగా ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నడుపుతున్నాను. మళ్లీ కానిస్టేబుల్ ఉద్యోగ నోటిఫికేషన్ రావడంతో ఆటో నడుపుతూనే ఉద్యోగం సాధించాను. నా భార్య సహకారం మరవలేనిది.

– కుటుంబ సభ్యులతో కిషోర్

వ్యవసాయ కుటుంబం నుంచి పోలీస్‌గా..



దహెగాం: మండలంలోని రాంపూర్‌కు చెందిన కాటెల వెంకటేశం, పద్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందులో పెద్ద కుమారుడైన కాటెల భీమేష్‌కు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదువుకున్నాడు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు రాంపూర్ గ్రామంలో విద్యనభ్యసించాడు. పదో తరగతి కాగజ్‌నగర్‌లో చదివాడు. ఇంటర్ రెబ్బెనలో పూర్తి చేసి, డిగ్రీ మంచిర్యాలలో చదివాడు. డిగ్రీ తోనే ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. మారుమూల గ్రామంలో పుట్టి పోలీస్ ఉద్యోగం సాధించినందుకు గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

– కాటెల భీమేష్, రాంపూర్

స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

- మైనింగ్ విస్తరణకు అభ్యంతరం లేదు
- కంపెనీ ప్రతిసారి హామీలు ఇచ్చి విస్మరిస్తుంది



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మైనింగ్ విస్తరణకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు లేవని స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గురువారం దేవాపూర్ గ్రామపంచాయతీ అవరణలో సున్నపురాయి గని -2 విస్తరణపై తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టీఎస్‌ఎండీసీ)ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ హాజరైన ఈ సమావేశంలో మైనింగ్ విస్తరణకు సంబంధించి 588.26 హెక్టర్ల అటవీ భూమి అవసరం కాగా ప్రజాభిప్రాయ సేకరణలో పలువురి అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలు మాట్లాడుతూ కంపెనీ అభివృద్ధి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని హామీలు ఇస్తూ తరువాత సమస్యలను పక్కన పెడుతోందని, మూడు ప్లాంట్లు ఏర్పాటు చేసిన సమయంలో ఇలాగే హామీలు ఇచ్చి స్థానిక ఆదివాసీలకు, నిరుద్యోగులకు చేసిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్రావుపల్లి, దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో భూములు అవసరం కాగా తమకు సమాచారం లేదని, ఎక్కువ భూమి తమ పరిధిలో ఉందంటూ గత్రావుపల్లి గ్రామస్తులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఇంజినీరింగ్ అధికారి లక్ష్మణ్ ప్రసాద్, టీఎస్‌ఎండీసీ, పర్యావరణశాఖ అధికారులు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధికారులు, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సత్యపాల్‌రావు, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి సీఐ దేవయ్య ఉన్నారు.

స్థానికులకు న్యాయం చేయాలి



ఓరియంట్ సిమెంటు కంపెనీ దశల వారిగా ప్లాంట్లు విస్తరిస్తూ వస్తుంది. అయినప్పటికీ అనుకున్న స్థాయిలో స్థానిక ఆదివాసీలు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కలేదు. స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తూ పరిసర గ్రామాలను అభివృద్ధి చేయాలి. కంపెనితో నష్టపోతున్న కుటుంబాలను ఆదుకోవాలి.

– సత్యపాల్‌రావు, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

హైకోర్టు తీర్పు ఇచ్చినా ఉద్యోగాలు ఇవ్వలేదు



భూములు కోల్పోయి ఏళ్లు గడుస్తున్నాయి. తరాలు మారిన హైకోర్టు తీర్పు వచ్చినా నేటికి ఉద్యోగాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. భూమి పోయింది బ్రతకడం ఎలా.. భూములకు వందమీటర్ల దూరంలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. పంటలు సైతం నష్టపోవాల్సి వస్తుంది.

– కోవ ధర్మరావు

ఖనిజ సంపదను దోచిపెట్టడమే



ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి అన్యాయం చేస్తున్నారు. ఏజెన్సీలో మైనింగ్ లీజు కుదరదని కోర్టులు తీర్పు ఇవ్వడంతో టీఎస్‌ఎండీసీని ఏర్పాటు చేసి పనులు చేపడుతున్నారు. కంపెనీ ఇచ్చిన కోట్ల రూపాయలు మధ్యవర్తిగా ప్రభుత్వానికి అప్పగించడం తప్పితే ఇక్కడ రూపాయి కూడా వినియోగించడం లేదు. జీపీలకు కనీసం రెండు శాతం నిధులు కేటాయించినా అభివృద్ధి అవుతాయి.

– రోడ్డ రవికుమార్

ఉద్యోగాలు కల్పించాలని నిరసన



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం గత్రావుపల్లి గ్రామస్తులు కంపెనీ క్వారీలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం నుంచి 300 ఉద్యోగాలు ఇస్తామని కంపెనీ చెబుతూ వచ్చిందని, పోలీసు అధికారులు మధ్యవర్తులుగా ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్రావుపల్లి పరిధిలో ఎక్కువ భూమి మైనింగ్‌లో పోతుండగా అధికారులు ఉద్దేశపూర్వకంగా ప్రజాభిప్రాయ సేకరణ దేవాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు విమర్శించారు. పోలీసులు క్వారీకి రాకుండా ప్రయత్నాలు చేసినప్పటికీ అటవీ ప్రాంతంలో నుంచి నడుచుకుంటూ అక్కడికి చేరుకున్నారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సంఘటన స్థలానికి చేరుకుని ఆదివాసీలతో మాట్లాడి కంపెనీ అధికారులను పిలిపించారు. నాల్గో ప్లాంటు ప్రారంభమైతే ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. మాకు రాత పూర్వకంగా హామీ ఇవ్వాలని కంపెనీ ఏర్పడిన నాటి నుంచి కనీసం చిన్న పనులకు సైతం స్థానికులను తీసుకోకుండా స్థానికేతరులను తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ అధికారులు ఒప్పుకోకపోవడంతో డీసీపీ తిరిగి వెళ్లారు. రాత్రి 7.30గంటలు దాటిన వారి నిరసన కొనసాగుతోంది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి సీఐ దేవయ్య, ఎస్సైలు అంజనేయులు, గంగారాం, రాజశేఖర్, పోలీసు బలగాలతో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: దేశవ్యాప్తంగా శుక్రవారం తలపెట్టిన సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. గురువారం ఆయన ఆర్కే 7 , ఎస్సార్పీ 3 తదితర గనులపై కార్మికులను కలిసి సమ్మెపై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నల్లబ్యాడ్జీలతో కార్మికులకు విధులకు హాజరు కావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత బొగ్గు బ్లాకులను కేంద్రం ప్రైవేటు పరం చేయకుండా అడ్డుకోవడంలో భాగంగా సింగరేణికే ఈబ్లాకులు దక్కేలా తగిన చర్యలను తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాల్సిన కీలక సమయమని, కంపెనీ మార్చి 31 నాటికి నిర్ధేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. బాధ్యతయుత కార్మిక సంఘంగా తాము సమ్మెకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, నాయకులు గరిగే స్వామి, బస్సు రమేశ్, తిరుపతిరాజు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



కమల్‌గౌడ్(ఫైల్)

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి నదిలో పుష్కర ఘాట్ వద్ద గురువారం ఉదయం మృతదేహం తేలడం కలకలం రేపింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేట గ్రామానికి చెందిన బత్తిని కమల్‌గౌడ్ (29) షార్ట్‌ఫిల్మ్‌స్ తీస్తుంటాడు. ఈ నెల 13న తనకు డేటా ఎంట్రీ ఉద్యోగం వచ్చిందని చెప్పి తన తండ్రి వద్ద రూ.70వేలు, బంధువు వద్ద రూ.44,500 తీసుకొని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, అదే రోజు రాత్రి వరుసకు తనకు అల్లుడైన ఆకుల పవన్‌కు ఫోన్ చేసి తన డబ్బులు మొత్తం హ్యాక్ అయ్యాయని చెప్పాడు. అనంతరం రెండ్రోజుల తర్వాత ఈ నెల 15న గురువారం రోజు కోటిలింగాల గోదావరి నదిలో శవమై తేలుతూ కనిపించాడు. షార్ట్ ఫిల్మ్‌స్ లొకేషన్ కోసం వచ్చి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మరణించాడా? లేక డబ్బులు పోయాయనే మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానం కలుగుతోంది. గోదావరి నది పుష్కరఘాట్ వద్ద మెట్లపై పాకురుతో గతంలో భక్తులు జారిపడి ప్రమాదాల బారిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ ఘటన కూడా ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానాలు కలుగుతున్నాయి. డబ్బులు పోవడంతోనే ఇంటికి ఎలా వెళ్లాలనే మనోవేదనతో గోదావరి నదిలో దూకి తన కుమారుడు మృతిచెందాడని తండ్రి బత్తిని మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: బైక్‌ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ... మోతుగూడ గ్రామానికి చెందిన బొట్టుపల్లి చరణ్‌దాస్ జన్కాపూర్‌లోని బాలాజీ జిన్నింగ్ మిల్లులో పత్తిని అమ్మి బయటకు వస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు వెళ్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు.

గుడుంబా, గంజాయి నివారణకు కృషి



పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గంజాయి, గుడుంబా నివారణకు కృషి చేస్తానని ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు తీసుకున్న సీఐ గురువయ్య అన్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన నరేందర్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో కాటారంకు బదిలీ చేయగా మంథని సీఐగా పనిచేసిన 2005 బ్యాచ్‌కు చెందిన జి. గురువయ్యను మంచిర్యాల సీఐగా నియమించారు. ఇటీవల గురువయ్య గతంలో లక్సెటిపేట, బెల్లంపెల్లి సీఐగా పనిచేశారు. విధుల్లో చేరిన అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేజీ నంద గోపాల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ సమావేశం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి-పర్యావరణ విద్యావిభాగం, విద్యాశాఖ సహకారంతో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో మోడల్ జిల్లా పరిషత్ పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ నెల 17నుంచి 24వరకు సమ్మక్క జాతర పర్యావరణ నమూనా జెడ్పీ సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. వీడియోలు, ఫొటోలు జిల్లా కో-ఆర్డినేటర్‌కు పంపించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు 28 ఫిబ్రవరిన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు గ్రీన్‌కో-ఆర్డినేటర్ యోగేశ్వర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రపంచ అథ్లెటిక్స్ లెవల్-2ఏ గ్రేడ్‌కు అర్హత



కోచ్‌తో విద్యాసాగర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్‌లోని ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ కేరళలోని త్రివేండ్రంలో ఎల్ఎన్‌సీపీఈలో ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించిన ప్రపంచ అథ్లెటిక్స్ లెవల్ 2 కోర్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి ఏ గ్రేడ్ అర్హత సాధించి లెవల్ 2కు ఎంపికైనట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావ్ తెలిపారు. శిక్షణ ద్వారా ప్రపంచంలో ఉన్న అత్యధికమైన టెక్నిక్స్‌ని నేర్చుకున్నారని విద్యాసాగర్ తెలిపారు. లెవల్ టులో ఏ గ్రేడ్ సాధించి క్వాలిఫై అయిన విద్యాసాగర్‌ని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి, ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీఏ క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సా రంగపాణి, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్, మంచిర్యాల అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, సాంబమూర్తి, సట్లా శంకర్, మారయ్య, లక్ష్మణ్, హ్యాండ్ బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకులు తిరుమల్, జిల్లాలోని వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: సింగరేణి సౌజన్యంతో పలు వృత్తి శిక్షణ కోర్సుల్లో నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్‌షిప్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 8 రకాల వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాస్మటాలజీ(మహిళల కోసం), డ్రోన్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూవీల్లర్ మెకానిక్, గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు శుక్రవారం లోగా సింగరేణి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.